# పోతన భాగవతము - సజీవ పాత్ర చిత్రణ

1. డా ||వి.పవన్ కుమార్ రెడ్డి,తెలుగు అధ్యాపకులు
కాకరపర్తి భావనారాయణ కళాశాల (స్వయంప్రతిపత్తి),విజయవాడ.
2. ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మ,శాఖాధిపతి, తెలుగు అధ్యయన శాఖ
శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం,తిరుపతి.

**కవి పరిచయం :** "సహజ కవి" బిరుదాంకితుడ్కెన పోతన తెలుగు కవులలో సుప్రసిద్ధుడు. ఈయన 15 వ శతాబ్దానికి చెందినవాడు. వరంగల్ జిల్లా బమ్మెర గ్రామం అని కొందరు, కడప జిల్లా ఒంటిమిట్ట అని మరికొందరు పోతన నివాస స్థలాలుగా చెబుతారు. తల్లిదండ్రులు లక్కమాంబ, కేసయ్య లు."సహజ కవి" బిరుదాంకితుడు పోతన. సంస్కృతంలో గల అష్టాదశ పురాణాలలో భాగవతం ఒకటి. "నన్నయ, తిక్కన, ఎర్రన" మహాకవులు నా పుణ్యంకొద్దీ భాగవతాన్ని తెలుగు చేయలేదు. దీనిని తెలుగులో రాసి పునర్జన్మ లేకుండా నా జన్మాన్ని సఫలం చేసుకుంటానని భావించిన కవి పోతన.

పోతన భాగవతంలోని 12 స్కంధములలో 5,6,11,12 తప్ప తక్కిన ఎనిమిది స్కంధములను తన చేతి మీదుగనే రచించెను. ఐదువది గంగనయు, ఆరవది ఏర్చూరి సింగనయు, తుది రెండు స్కంధములు వెలిగందల నారయయు పూర్తి చేసిరి. భాగవతంలోని కొన్ని పాత్రలు నేటికీ సజీవంగా నిలిచి వున్నాయి. ఎప్పటికీ సజీవంగా నిలిచే పాత్రల్ని సృష్టించడం మహాకవుల దార్శనితకతు నిదర్శనం. "ప్రహ్లాదుడు, గజేంద్రుడు, బలిచక్రవర్తి, కుచేలుడు" వంటి సజీవ పాత్రల్ని పోతన దర్శించాడు.పురాణ లక్షణమైన మానుష ధర్మం ఈ పాత్రల్లో నిక్షిప్తమై వుంది. ఈ పాత్రలన్నీ మానవీయ విలువలతో కూడి వుండి ఈనాటి తరానికి ఆదర్శప్రాయంగా వున్నాయని తెలియజేయడం ఈ పత్ర వుద్దేశ్యం.

**పాత్ర చిత్రణ:**

1. ప్రహ్లాదుడు : ఆంధ్ర మహాభాగవతం, సప్తమ స్కంధంలో వచ్చే "ప్రహ్లాద చరిత్ర" ప్రముఖ ఘట్టంగా పేరొందినది. ఇందులో చదువు యొక్క ప్రాధాన్యతను పోతన హిరణ్యకశిపుడు పాత్ర ద్వారా చెప్పిస్తాడు. సమాజం ప్రగతిశీలకంగా, విజ్ఞానవంతంగా ఎదుగుతున్న క్రమంలో విద్య ఎంతగానో దోహదపడుతుంది.

క. చదువని వాడజ్ఞుండగు
జదివిన సదసద్వివేక చతురత గలుగుం
జదువగ వలయును జనులకు
జదివించెద నార్యులొద్ద జదువుము
తండ్రీ!

(భాగవతము 'సప్తమ స్కంధము' 130)విద్య ప్రాముఖ్యాన్ని తెలిపి హిరణ్యకశిపుడు ప్రహ్లాదున్ని విద్యాభ్యాసం నెరపమని గురువులకు అప్పగిస్తాడు. చదువు అనేది మనుషుల్ని వివేకవంతుల్ని చేస్తుంది. విద్యా వ్యవస్థ వున్ననాళ్లు ఈ పద్యానికి సాహిత్య చరిత్రలో స్థానం వుంటుంది. కొన్నాళ్ల తర్వాత హిరణ్యకశిపుడు తన కొడుకైన ప్రహ్లాదున్ని గురువులు నీకు ఏమి బోధించారో, నీవేమి గ్రహించావో చెప్పమంటాడు. అప్పుడు ప్రహ్లాదుడు ఈ విధమైన సమాధానం చెప్తాడు.

క. చదివించిరి నను గురువులు
చదివితి ధర్మార్థముఖ్యశాస్త్రంబులు నే
జదివినవి గలవు పెక్కులు
చదువులలో మర్మమెల్ల జదివితి దండ్రీ!
(భాగవతము 'సప్తమ స్కంధము'– 166)

తండ్రీ! గురువులు నాచే చక్కగా చదివించిరి. నేను ధర్మశాస్త్రము, అర్థశాస్త్రము మొదల్కెన ముఖ్య శాస్త్రములను చదివితిని. నేను చదివినవి అనేకములున్నవి. చదువులలో సారమంతా చదివితిని తండ్రీ అని తన నిశ్చలమైన భక్తి తత్వాన్ని చాటుకుంటాడు. ప్రహ్లాదుడు మంచి గుణాలు

కల్గినవాడు, మంచి వ్యక్తిత్వం కలవాడు. స్థిర చిత్తుడు, శాంత స్వభావి. వినయ సంపన్నత మెండుగా వున్నవాడు. ఒకరి మీదనే విశ్వాసం, గురి వున్నవాడు. కాబట్టి ప్రహ్లాదుడి లాంటి శాంతం, స్థిరత్వం, ఏద్కైనా ఒకదానిపైన నిలబడగలగడం నేడు అవసరం. ఎందుకంటే నేడు మనం ప్రపంచీకరణ యుగంలో వేగవంతమైన జీవితాన్ని కలిగి వున్నాము. నిలకడ, శాశ్వతత్వం అనేవి లేనేలేవు. మనుషుల్లో చంచలత్వం, చపలత్వం అనేవి వుండకూడని అంశాలు. ఇలాంటి సందర్భంలో జీవిస్తున్న మనకు ప్రహ్లాదుడికి వున్నటువంటి గుణాల్ని ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం వుందనిపిస్తుంది.

నైతిక విలువలతో కూడిన విద్యను అందించడమే నేటి విద్యా సంస్థల లక్ష్యంగా వుంది. “అందరికీ నాణ్యమైన ఉన్నత విద్యను అందించడమే” తన లక్ష్యంగా యూజీసి ప్రకటించుకుంది. మొత్తానికి సారవంతమైన విద్యను ఆర్జించడమే విద్యార్థుల కర్తవ్యంగా విద్యారంగం పని చేస్తున్నది. మానవ సమాజం జ్ఞానవంతం కావడానికి ఇటువంటి కవిత్వ అధ్యయనం తప్పనిసరి అంశంగా ఎప్పటికీ నిలిచి వుంటుంది. కాబట్టి

ప్రహ్లాదుడిని సజీవ పాత్రగా పోతన మలిచాడు.

2. గజేంద్రుడు : శరణాగత భక్తి మార్గానికి ప్రతినిధి గజేంద్రుడు. ఏద్కైనా ఆపద సంభవించినపుడు, ఆ ఆపద నుంచి బయటపడటానికి శాయశక్తులా ప్రయత్నించాలి. గజేంద్రుడు నీళ్ల కొలనులోకి దిగినపుడు మొసలి బారిన పడతాడు. మొసలి నుంచి తప్పించుకోవడానికి తన బలాన్నంతా ప్రయోగిస్తాడు. తన శక్తి మేరకు పోరాడుతాడు. ఈ విషయం నేటికీ ఆదర్శనీయం. గజేంద్రుడు మొసలితో పోరాడి పోరాడి చివరికి అలసిపోతాడు. మన శక్తి సామర్థ్యాలను వుపయోగించి ఆపదల నుంచి బయటపడాలనే సందేశం యిందులో వుంది. తాత్వికమైన విషయాలు కూడా గజేంద్ర మోక్షం ఘట్టంలో ప్రస్తావించబడ్డాయి. ఈ లోకం ఎవరి చేత పుట్టింది, ఎవరిలో అంతర్భాగం అయి వుంది అనేటటువంటి ప్రశ్నలు లేవనెత్తుతాడు గజేంద్రుడు. ఈ జగానికి మూలకారణం ఎవరు అని ప్రశ్నించి, ఆ మూల కర్తని శరణు వేడుకొంటానంటాడు. అదేవిధంగా దేవుడు వున్నాడా ? లేడా ? అనే విషయంలో సంశయం కూడా వ్యక్తం చేస్తాడు.

క. కలడందురు దీనులయెడ

గలడందురు పరమయోగి గణములపాలం

గలడందు రన్ని దిశలను

గలడు గలండనెడువాడు గలడో లేడో

(భాగవతము ‘అష్టమ స్కంధము’– 86)

ఇలాంటి విషయాల మీద నేటికీ చర్చ నడుస్తున్నది. ప్రహ్లాదుడు అన్ని చోట్లా దేవుడు వున్నాడని నమ్మకం కల్గివున్నాడు. గజేంద్రుడు యిక్కడ సందేహిస్తున్నాడు. ఏ దిక్కు లేని ప్రాణికి దేవుడే దిక్కు. ఆ దేవుడు నాపైన కరుణ చూపకపోతాడా అని తలపోస్తాడు. ఆ విధంగా గజేంద్రుడు ఈశ్వరున్ని వేడుకుంటాడు.

శా. లావొక్కింతయు లేదు, ధైర్యము విలోలంబయ్యె బ్రాణంబులున్

ఠావుల్ దప్పెను, మూర్ఛ వచ్చె దనువున్ డస్సెన్, శ్రమంబయ్యెడిన్నీవే తప్ప నిత: పరంబెఱుగ, మన్నింపదగున్ దీనునిన్

రావే యీశ్వర ! కావవే వరద ! సంరక్షించు భద్రాత్మకా

(భాగవతము ‘అష్టమ స్కంధము’– 90)

ఈ విధంగా శరణు కోరిన గజేంద్రుడి మొరని విని శ్రీ మహావిష్ణువు వచ్చి కాపాడతాడు. శరణార్థులని ఆదుకోవడం, సహాయం చేయడం అనేది మానవీయ లక్షణం. గజేంద్ర మోక్షం వంటి ఘట్టాన్ని చదువుతున్నపుడు దైవ ధర్మాలు తెలుస్తాయి. అదే విధంగా మానవీయ ధర్మాలు కూడా స్ఫురిస్తాయి. ఇలా గజేంద్రుడి కథని మానవ జీవితానికి అన్వయించుకుంటే అదొక సజీవ పాత్రగా నిలుస్తుంది.

“భాగవత భక్తి జ్ఞాననిరూఢమైన భక్తియే కాని మూఢభక్తి కాదనియు, భాగవత జ్ఞానము ఈశ్వర సేవా పూర్వకమే కాని భక్తిరహిత జ్ఞానము కాదనియు గ్రహింపవలయుని. ఈ పద్యము భక్తి పరాయణత్వమునకు పరమావధి. నేటికిని ఆపదవేళల గజేంద్ర మోక్షమును సంజీవనిగా జపించువారున్నారు.” అన్న పింగళి లక్ష్మీకాంతము గారి మాటలు గుర్తుంచుకోదగినవి.

3. బలిచక్రవర్తి : ఆంధ్రమహాభాగవతంలో “వామన

చరిత్ర" అష్టమ స్కంధములో వుండే మరొక ప్రముఖమైన కథాంశంగా పేరొందినది. బలిచక్రవర్తి విష్ణు భక్తుడైన ప్రహ్లాదుని వంశంలో జన్మించాడు. ప్రహ్లాదుని కుమారుడు విలోచనుడు. విలోచనుని కుమారుడు బలిచక్రవర్తి. బలిచక్రవర్తి ధర్మపాలన చేస్తూ సత్యసంధుడై దాన తత్పరుడైనాడు. ధర్మమూర్తి అడిగిన వాడికి లేదనకుండా దానం చేస్తూ కృతయుగే "బలిర్దాతా" అనే చిరకీర్తిని సంపాందించుకున్నాడు.

వామనుడు తనకు మూడడుగుల నేల కావాలని బలిచక్రవర్తిని అభ్యర్థించాడు. అందుకు బలిచక్రవర్తి సరే అట్లాగే ఇస్తాను అన్నాడు. రాక్షస గురువు శుక్రాచార్యుడు "ఓ రాజా ఇతడు సాధారణ వటువు కాదు ఇతడు దేవతలకు మేలు చేయడానికి ఈ రూపంలో వచ్చాడు. ఈ దానం చెయ్యడం వల్ల నీకు మేలు కలగక పోగా కీడు జరుగుతుంది. ఈ దానం ఇవ్వవద్దు" అని అన్నాడు. అయితే ఆచార్యుని హితవచనములు విస్మరించి సత్యసంధతను నిలబెట్టుకున్నాడు బలిచక్రవర్తి. గురుదేవులు శుక్రాచార్యుని మాటలు విని క్షణమాలోచించి కీర్తివంతుడైన బలిచక్రవర్తి యిట్లనెను.

సీ. నిజమానతిచ్చితి నీవు మహాత్మక మహిని

గృహస్థ ధర్మంబు నిదియ

యర్థంబు గామంబు యశమును వృత్తియు

నెయ్యది ప్రార్థింపనిత్తుననియు

నర్థలోభంబున నర్థి బొమ్మనుటెట్లు పలికి

లేదనుకంటె బాపమెద్ది యెట్టి దుష్కర్ముని భరించెద గాని

సత్య హీనుని మోవ జాలననుచు

తే. బలుకదే తొల్లి భూదేవి బ్రహ్మతోడ

సమరమందద్దు తిరుగక చచ్చుకంటె

బలికి బొంకక నిజమున బరగుకంటె

మానధనులకు భద్రంబు మఱియుగలదె

(భాగవతము 'అష్టమ స్కంధము'– 587)

మహాత్మా! గురుదేవా! నీవు నిజమానతిచ్చితివి. ఈ భూమిపై నీవు చెప్పిన మాటలే గృహస్థులకు ఆచరణీయ ధర్మములు. కాని అర్థ కామ కీర్తి వృత్తులలో ఏది కోరినను యిచ్చెదనని మాట యిచ్చి, అర్థలోభముచే నిప్పుడు అర్థిని (అడిగినవానిని) పొమ్మనుటెట్లు? ఇచ్చెదనని పలికి లేదనే కంటె ఘోరమైన పాపమేది? ఎటువంటి పాపాత్మున్నైనను నేను భరించెదను గాని సత్యహీనుని మాత్రము మోయజాలనని పూర్వం భూదేవి బ్రహ్మదేవునితో చెప్పలేదా?యుద్ధమందు వెనుదిరగక చచ్చుటకంటె, మాటచెప్పి అసత్యమాడకుండ సత్యమునే పాటించుట కంటె, మానధనులకు శ్రేయస్కరమింకేది సున్నదా? అని బలిచక్రవర్తి శుక్రాచార్యుడికి సమాధానం యిచ్చాడు.

శా. కారే రాజులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతిం బొందరే

వారేరీ సిరి మూటగట్టుకొని పోవంజాలిరే భూమిపై

బేరైనం గలదే శిబిప్రముఖులుం బ్రీతిన్ యశఃకాములైయీరే కోర్కులు వారలన్ మఱచిరే యిక్కాలమున్ భార్గవా !

(భాగవతము 'అష్టమ స్కంధము'– 589)

బలిచక్రవర్తి యశస్వి. రాక్షసరాజైనా సత్యమూర్తి. తనువునశ్వరతను, సిరుల అస్థిరతను ఎరిగిన జ్ఞాని. అందుకే శుక్రాచార్యుల వక్రనీతికి సూటిగా బదులు చెప్పగలిగినాడు. పలికి బొంకడం కంటె పాపం లేదన్నాడు. ఎందరెందరో రాజులున్నారు. ఎన్నెన్నో రాజ్యాలేలినారు. ఉన్నంత కాలం మిడిసి పడ్డారు. ఏమైంది చివరికి ? పోయేటప్పుడు కూడబెట్టుకున్న సిరి మూటగట్టుకొని పోలేదు. భూమిపై వారి పేరైనా మిగుల లేదు. కాని, శిబిచక్రవర్తి లాంటి కొందు ధర్మజ్ఞులున్నారు. వారు అన్యుల కొరకు ఆత్మార్పణం చేసుకొన్నవారు. అన్ని కాలాలకూ చెన్ను చెదరని కీర్తి వారిది. వారు నడిచిన పుణ్యపథమే తనది.

యుద్ధంలో వెనుదిరగకుండా వీరమరణం పొందటమూ, మాటకు కట్టుబడి సత్యంతో బ్రతకడమూ మానధనులైన వారికి మేలైన మార్గాలు. మాటకీ, చేతకీ కట్టుబడినవాడు బలిచక్రవర్తి. ఇంతటి సత్య నిష్టతకు ఈ క్రింది పద్యం ఒక మచ్చుతునక లాంటిది.

ఆ. బ్రదుకవచ్చుగాక బహుబంధనములైన

వచ్చుగాక లేమి వచ్చుగాక

జీవధనము లైన జెడుగాక పడుగాక

మాట దిరుగలేరు మానధనులు

(భాగవతము 'అష్టమ స్కంధము'– 597)

అనేకమైన బంధనములచే చుట్టబడినను బ్రతుకవచ్చును. సంపదలన్నీ పోయి, లేమివచ్చినను బ్రతుకవచ్చును. ధనము నష్టమైనను అగుగాక, జీవనము కష్టములపాల్కెనను అగుగాక! మానధనులు మాత్రము ఇచ్చిన మాటను తప్పలేరు. మాట మీద నిలబడటం అనేది మనుష్య ధర్మం. అందుకే ఆడిన మాట తప్పరాదు అంటారు. మాటలు నీటి మూటలు కాకుండా మనుషుల మాటల్ని బ్రతికించుకోవాలి, నిలబెట్టుకోవాలి. అప్పుడే మానవుల మధ్య సంబంధాలు మెరుగ్గా వుంటాయి.

4. కుచేలుడు : ఆంధ్రమహాభాగవతంలోని ప్రముఖమైన ఘట్టాలలో దశమస్కంధంలోని "కుచేలోపాఖ్యానం" ఒకటి. శ్రీకృష్ణుడు, కుచేలుడు ఇద్దరూ బాల్య స్నేహితులు. తమ స్నేహాన్ని బాల్యంలోనే గాక యవ్వనానంతరంలోనూ కొనసాగించిన వారు. కుచేలము అనగా చిరిగిపోయిన బట్ట (చినిగిన వస్త్రము) అని అర్థము. కుచేలుడు పెళ్లి చేసుకున్నాక దారిద్ర్యంలో కూరుకుపోతాడు. భార్యా బిడ్డలు ఆకలితో అలమటిస్తుంటారు. ఆ సమయంలో కుచేలుడి భార్య, కుచేలుడిని తన బాల్య స్నేహితుడైన శ్రీకృష్ణుని దగ్గరకు పంపుతుంది. శ్రీకృష్ణుడు సంపన్నవంతుడు. ఆర్త జనులను ఆదుకునేవాడు. అట్లాంటి శ్రీకృష్ణుడు తన బాల్య స్నేహితుడు, దారిద్ర్యంతో బాధ పడుతున్నవాడు అయిన కుచేలుడిని ఆదరించిన తీరు ఈ క్రింది పద్యంలో పోతన వ్యక్తం చేశాడు.

చ. తన మృదు తల్పమందు వనితామణ రమాలలామ పొం

దును నెడగా దలంపక

యదుప్రవరుండెదురేగి మోదముం

దనుకగ గౌగిలించి యుచిత క్రియలం బరితుష్టు జేయుచున్

వినయమునను భజించె ధరణీ సురుడెంతటి భాగ్యవంతుడో?

(భాగవతము 'దశమ స్కంధము, ఉత్తర భాగం'– 987)

కుచేలుడు ఎంతటి భాగ్యవంతుడో అనుకుంటూ అంత:పుర కాంతలు సహితం ఆశ్చర్యపోయారు. కానీ కుచేలుడు నిర్భాగ్యుడు. శ్రీకృష్ణుడు కుచేలుడిని స్నేహంతో, ప్రేమతో ఆలింగనం చేసుకొని చక్కని ఆత్మీయ సత్కారం చేశాడు. వివాహానంతరం కూడా పూర్వపు స్నేహాన్ని బలపరిచాడు. కొంతమంది పెళ్లయ్యాక ఎవరికి వారు వుండిపోతారు. స్నేహాలు వంటివాటిని పట్టించుకోరు. స్నేహితులు ఆపదలో వున్నా ఆదుకోరు. కానీ శ్రీకృష్ణుడు నా పాత స్నేహితుడు అంటూ అక్కున చేర్చుకున్నాడు. స్నేహ ధర్మం పాటించని వారికి చలనమొచ్చేలా చేసిన ఆదర్శ స్నేహం వీరిది అని చెప్పవచ్చు. "ఆపదలో ఆదుకునేవాడే నిజమైన స్నేహితుడు" అన్న సూక్తికి, నానుడికి నిదర్శనమే శ్రీకృష్ణ, కుచేల స్నేహతత్వం.

మానవుడు సకల ఐశ్వర్యాలతో తులతూగుతున్నా, స్నేహితుల పట్ల ధనమదాంధతను ప్రకటించరాదు. వారికి సాయపడడం కర్తవ్యంగా భావించడమే స్నేహధర్మం. త్రికరణ శుద్ధిగా చేసేదే మధుర స్నేహం.

**ముగింపు:**

పోతన భాగవతంలో మానుష ధర్మం వుంది. ఇది ఏ కాలానికైనా అవసరమే. ఈ భూమి మీద మనుషులున్నంత వరకు ఈ ధర్మం అనేది వుంటుంది. వర్తమాన కాలంలో మానవీయ శాస్త్రాల ఆవశ్యకతను అన్ని సంస్థలూ, వ్యవస్థలూ గుర్తిస్తున్నాయి. కాబట్టి పోతన భాగవతంలోని సజీవమైన పాత్రలు నేటి కాలానికి కూడా ఆదర్శవంతంగా

వుంటున్నాయి. కాబట్టి నేటి తరం పోతన భాగవతాన్ని అధ్యయనం చేయడం అవసరం.

తద్వారా మానవీయ విలువలు మానవ సమాజంలో వెల్లివిరుస్తాయి. పోతన కవిత్వంలో తెలుగుదనం స్పష్టంగా కనిపిస్తుంటుంది. తెలుగు నుడికారాలు తారసబడుతుంటాయి. పోతన పద్యాలలో శబ్దాలంకారాలు శ్రవణపేయంగా వుంటాయి. తెలుగు వారు ప్రతి ఒక్కరూ పఠించాల్సిన ఉత్తమ కావ్యం పోతన భాగవతము.

**ఆధార గ్రంథాలు:**


1. ఆంధ్ర భారతి వెబ్ సైట్

2. మందార మకరందాలు (1973)' డా|| సి. నారాయణ రెడ్డి, యువభారతి ప్రచురణ, హైదరాబాదు.

3. శ్రీమద్ భాగవత పంచరత్నములు (2014)' సంకలనం: బాలగంగాధర్ పట్నాయక్, గీతాప్రెస్, గోరఖ్‌పూరు.

4. ఆంధ్ర సాహిత్య చరిత్ర (2018)' పింగళి లక్ష్మీకాంతము, నవచేతన పబ్లిసింగ్ హౌస్, హైదరాబాదు.